అతని పేరు మనిషి

కన్నేపల్లి గోపాలకృష్ణ

ఇంటిలో మనిషి పోయినట్లు ఎడతెరిపి లేకుండా ఏడుస్తోంది ఆకాశం రెండు రోజులుగా.

అటు చినుకులూ కాక, ఇటు వానాకాక ముసురుపట్టి నులికడుపులా చికాకు పెడుతోంది వర్షం.

వరండాలో అసహనంగా పచార్లు చేస్తున్నాడు వరదరాజులు.

"వెధవ వాన" ఏ నూటఒకటోసారో అనుకున్నాడు ఆ గంటలో.

"అప్పుడనగా వెళ్ళిన ఈ నౌకరువెధవ ఇంకా రాడేం?" చికాగ్గా గొనుక్కున్నాడు. ఏంచేయాలో తోచక మళ్ళీ పచార్లు ప్రారంభించాడు.

కర్నీ సిల్కులాల్చీతో, మెడలో సన్నపాటి బంగారు గొలుసుతో అతనలా చేతులు వెనక పెట్టుకొని తిరుగుతుంటే ఏ పెద్దపులో తిరుగుతున్నట్లుంది.

ఆ జిల్లాకి ఒకప్పుడు పెద్దపులే వరదరాజులు.

అతను ఫోన్‌కాల్ కొడితే సరి ఉరుకులు, పరుగులమీద పనులు చేసిపెట్టేవారు అధికారులు.

ఆ వరండా ఇప్పుడంటే బోసిగా ఉందికానీ ఆశ్రితజనాలతో కిటకిటలాడేది మూడేళ్ళ క్రిందటి వరకూ.

ఆ జిల్లాలో ప్రతి ఎమ్మెల్యే నెలకు రెండు సార్లయినా అతని దర్శనార్థం రావలసిందే.

అతను నవ్వితే వంతకలిపేవారు జనాలు.

మాట్లాడితే 'ఓహో' అని తలలూపేవారు.

అతను చెప్పిందే వేదమన్నట్లు ప్రవర్తించేవారు.

అవును మరి! బెల్లం చుట్టూ చీమలు చేరుతాయి. అధికారం ఉన్నవాడి చుట్టూ ఆశ్రిత జనులు చేరుతారు. ఇది లోకసహజం.

ఇరవై ఏళ్ళపాటు ఆ జిల్లాని మకుటం లేని మహారాజులా పరిపాలించాడు వరదరాజులు వివిధ హోదాలతో.

ఎమ్మెల్యేగా, కార్పొరేషన్ ఛైర్మన్‌గా, మంత్రిగా, జిల్లాపరిషత్ అధ్యక్షుడిగా. అతడు ఎత్తని రాజకీయావతారం లేదు. ప్రత్యర్థుల మీద వేయని పాచికా లేదు.

కాస్తలో ముఖ్యమంత్రి అయేవాడు కానీ కొత్తగా వచ్చిన పార్టీ వెల్లువలో కొట్టుకు పోయాడతను, జనం నాడిని తెలుసుకోలేక.

ఇంత రాజకీయ పరిజ్ఞానమూ దెబ్బతింది— ఆ ఒక్క విషయంలో. అలా జరుగుతుందని ముందే ఊహించి ఉంటే ఏనాడో జెండా మార్చేసేవాడతను.

అంచనాలు తారుమారై, తాను చిత్తుగా ఓడిపోయాక ఆశ్రితులతో చాలా మంది దూరమయ్యారు. అతనితో మిగిలినవాళ్ళు ఇప్పటికైనా మించిపోయింది లేదు పార్టీ మారిపొమ్మని బలవంతపెట్టినా అతను వినలేదు.

ఓడినవాడు ఏ పార్టీలో ఉన్నా ఒకటేనన్నది వరదరాజుల ఫిలాసఫీ. అదే తను గెలిచి ఉంటే ఏ మంత్రి పదవికో బేరమాడేసి గోడ దూకేసేవాడు. ఇప్పుడు తను అటు గెంతుదామన్నా వాళ్ళేం సంబరపడిపోరు. దాని బదులు పాత పార్టీలో ఉంటేనే నయం. ఏ రోజైనా తిరిగి అది అధికారంలోకి రాక మానదు. పార్టీ విధేయుడిగా తనకు తగిన ప్రతిఫలం లభించక తప్పదు.

ఇది వరదరాజుల ప్రగాఢ విశ్వాసం.

అందుకనే అతను తొందరపడలేదు.

కొత్తపార్టీలోకి వలసపోయిన వాళ్ళు పోగా మిగిలినవాళ్ళతో పార్టీపునర్నిర్మించేకార్యక్రమంలో బిజీగా ఉన్నాడతను.

అతని శ్రమనుంచుకోక తగిన నిధులే ముట్టచెప్తోంది పార్టీ.

ఇంకా చెప్పాలంటే రెండు భగవద్గీతల చరిత్ర ఉంది అతని వెనుక.

ఇక వర్తమానంలోకి వస్తే—

కొన్ని పార్టీ విషయాలు అత్యంత అర్జెంటుగా మాట్లాడాలని, ఇమ్మిడియేటుగా రమ్మని లైట్నింగ్ కాల్ బుక్‌చేసి మరీ చెప్పాడు భావనపాడు మాజీ ఎమ్మెల్యే. తనకున్న సహచరులలో అత్యంత విశ్వాసపాత్రుడతను.

అంత ముఖ్యమైన విషయం కాకపోతే అతనంతగా కంగారు పడడు. బహుశా తమ ఫ్యూచర్ ప్లానులకు సంబంధించినది అయి ఉండవచ్చు.

ముప్పై కిలోమీటర్ల దూరమిక్కడికి భావనపాడు.

కారులో వెళ్తే అరగంట ప్రయాణం.

ఉన్న అంబాసిడర్ సమయానికి పనికి రాకుండా పోయింది.

బండి సరిగ్గా లాగడం లేదని రెండురోజుల క్రితమే రిపేరుకు పంపాడతను.

స్కూటరుపై వెళ్దామంటే పసిపాప ఏడుపులా ముసురు.

నౌకరు గేటు తెరుచుకు రావడంతో ఆత్రంగా చూశాడు వరదరాజులు.

"ఏమన్నాడ్రా డాక్టరు" నౌకరు ముఖం చూడగానే సగమర్థమయ్యిందతనికి.

గొడుగు మడుస్తూ ఆ మిగిలిన సగం పూర్తి చేశాడతను.

"అవును బాబయ్యా! ఆరి ఫామిలీ పిచ్చర్ కెల్తారట కారులో. అందుకని ఈలు కాదన్నారయ్యా డాట్టరు బాబు."

"హుఁ" అంటించని చుట్టను నేలకేసి కొట్టాడు వరదరాజులు.

"అంత పొగరెక్కిందన్నమాట ఆ డాక్టర్‌కి. ఈ రోజు ఈ గడ్డపై నిలబడగలిగాడంటే వరదరాజుల చలవేనని మరచిపోయాడన్నమాట. అర్జెంటుగా కారు కావాలని కబురంపితే అంత నిర్మొహమాటంగా కాదంటాడా? కృతఘ్నుడు. వీడి రోగం కుదిర్చే రోజు రాకమానదు" కసిగా అనుకున్నాడతను.

కిం కర్తవ్యమ్?

అర్జెంటుగా వెళ్ళాల్సిన విషయం.

ఇక ఆర్టీసీ బస్సే శరణ్యం.

బస్‌స్టాండు మూడున్నర కిలోమీటర్ల దూరం. బస్‌స్టాండుకి పోవాలంటే రిక్షా తప్ప మరో మార్గం లేదు.

"రిక్షా పిలుచుకురా, పో" పురమాయించాడు.

మళ్ళీ గొడుగు తెరిచి వెళ్ళాడు నౌకరు.

అయినా బస్‌స్టాండులూ, రైల్వేస్టేషన్లూ ఊరికి దూరంగా ఎందుకు కడుతుందో ప్రభుత్వం?

అసలు ఊరి మధ్యలో కట్టాల్సిన కాంప్లెక్సే అది.

ఆ కాంప్లెక్స్ కట్టడానికి ఇంజనీరు ఎంచిన భూమి బావమరిదిది. అందుచేత తాను పైఎత్తేసి ఊరికి దూరంగా ఉన్న తన పోరంబోకు భూమిని దానంగా ఇచ్చేసాడు ప్రభుత్వానికి బస్‌స్టాండు కట్టుకోమని.

ఆ సమయంలో ప్రజలూ, పత్రికలూ తనని దానకర్ణుడికి పొగిడిన తీరు గుర్తొచ్చి నవ్వు మొలుచుకొచ్చింది అతని పెదవులపై.

"రిక్షా తెచ్చాను బాబూ" వినయంగా చెప్పాడు నౌకరు.

చిరిగిన బట్టలూ, నీళ్ళు కారుతున్న తలా,

బక్కచిక్కిన శరీరమూ ఈ దేశపు దరిద్రుడి ప్రతినిధిలా ఉన్నాడు రిక్షావాడు.

వయసు పాతిక నుంచి ముప్ఫై దాకా ఉండొచ్చు.

కనీసం తలపైన కప్పుకోడానికి గుడ్డముక్క కూడా లేదేమో చిక్కగా తడిసిపోయి ఉన్నాడతను.

అతన్ని చూడగానే వరదరాజులకెందుకో జాలేసింది.

ఇంత వానలో తొక్కగలడా వీడు అనుకున్నాడు.

"ఏరా, అలా ఊరికే వానలో తడిసేబదులు ప్లాస్టిక్ కాగితమైనా కప్పుకోరాదూ" మందలించాడు. ఓ విచిత్రమైన నవ్వు నవ్వాడు రిక్షావాడు.

తరచి చూస్తే ఆ నవ్వులో ఎన్నో అర్థాలు కనిపిస్తాయి. అంత ఓపికలేని వరదరాజులుకి అనిపించిందొక్కటే — వాడందుకు కూడా నోచుకోలేదని.

అతనికి తన పాత రెయిన్ కోటు గుర్తొచ్చింది.

అక్కడక్కడా చిల్లులు పడ్డా గట్టిగానే ఉందది.

వీడికి దానం చేస్తేసరి— సంతోషిస్తాడు.

"అరేయ్ సింహాచలం. అమ్మగార్నడిగి నా పాత రెయిన్‌కోటు పట్టుకురా పో" చెప్పాడు నౌకరుకి.

రెండు నిముషాల్లో తిరిగొచ్చాడు నౌకరు రంగువెలసిన పాతపచ్చటి రెయిన్‌కోటుతో. గత కాలపు వైభవాల చిహ్నంలా ఉందది.

"ఇంద. ఇది తొడుక్కో" చెప్పారు వరదరాజులు రిక్షావాడితో.

"వద్దులే బాబుగారూ" కదలకుండా చెప్పాడు రిక్షావాడు.

"ఊరికే ఇస్తుంటే టెక్కు చూపిస్తావేంరా! వానలో చూడు ఎలా ముద్దైపోయావో. వర్షానికి బాగా కాస్తుందిది. తొడుక్కొని చూడు" కసురుతున్నట్లు చెప్పి, రెయిన్‌కోటు అందించాడు వరదరాజులు.

ఏమనుకున్నాడో ఏమో మారుమాట్లాడకుండా తీసుకున్నాడు రిక్షావాడు.

ఆ సమయంలో ఫొటోగ్రాఫరు లేనందుకు కాస్త బాధపడ్డాడు వరదరాజులు.

"రేపటికల్లా వచ్చేస్తాను. ఇంటికెవరొచ్చినా వైజాగెళ్ళానని చెప్పు. రాత్రి తలుపులన్నీ జాగ్రత్తగా వెయ్యి" పనివాడితో చెప్పాడు వరదరాజులు రిక్షా ఎక్కుతూ.

మన్నుతిన్న పాములా మెల్లగా కదిలింది రిక్షా.

లంక పుగాకు చుట్టను వెలిగించి, గట్టిగా దమ్ము పీల్చాడు వరదరాజులు గుండెలనిండా!

వేడి గుండెల్లోంచి ఒళ్ళంతా జలజలా పాకినట్లయి, కళ్ళు మూసుకున్నాడు తన్మయత్వంతో.

మళ్ళీ మరో పీల్చు పీల్చాడు. రిక్షా మెల్లగా పోతున్నట్లనిపించింది.

రిక్షా అతను రిక్షా తొక్కడానికి బదులు క్రిందకుదిగి నడిపిస్తున్నాడు.

అతని నీరసపు ముఖమూ, పట్టుతప్పుతున్న చేతులూ, ఇందాక తనుచూసిన లోతు కడుపూ అతను తిండితినలేదని చెప్పకనే చెప్తున్నాయి.

వీడి లెక్కన నడిపిస్తే బస్‌స్టాండు పోవడానికి గంటపైగానే పడుతుంది. ఇంతలో బస్సు వదిలేసినా వదిలెయ్యొచ్చు.

వీడ్ని హుషారు పరచాలంటే వీడి ఆకలి తీర్చడంతప్ప మరో మార్గంలేదు.

"ఏరా అబ్బీ, భోంచేసావా ఈ రోజు?" గొంతులో కరుణరసం మేళవించి అడిగాడు వరదరాజులు.

రిక్షావాడు సమాధానం చెప్పకుండా తల వంచుకొని రిక్షా నడుపుతున్నాడు. "ఆపు" అన్నాడు వరదరాజులు.

రిక్షా ఆగింది.

"ఏరా, భోంచేసి రెండు రోజులయ్యింది కదూ నువ్వు. వెర్రినాగన్నా, సిగ్గుపడుతున్నావా?" లాలనగా అడిగాడు వరదరాజులు.

రిక్షావాడు తల ఎత్తాడు. కంటినిండ కన్నీరు.

"అలా బాధపడకురా పిచ్చిసన్నాసీ. ఏడిస్తే కడుపు నిండుద్దా. చూడు తిండిలేక ఎలా డీలపడ్డావో? తిండి కలిగితే కండ కలదోయ్, కండ కలవాడే మనిషోయ్ అన్నాడు మహానుభావుడు. ఇంద ఈ రెండ్రూపాయలూ పట్టికెళ్ళి ఆ కనబడే హోటల్లో కాస్త తినిరా" నోటు అందిస్తూ చెప్పాడతను.

"వద్దు బాబూ, తర్వాత తింటా" నేల చూపులు చూస్తూ చెప్పాడు రిక్షావాడు. "ఒర్నీ, నీ బెట్టు దొంగల్తోలా! నువ్వేమీ తినకపోతే పాపం నాకు చుట్టుకుంటుందోయ్. చూడు ఎంత నీరసంగా ఉన్నావో? మరేం మాట్లాడక కొంచెం తినిరా" అతని చేతిలో బలవంతంగా నోటు పెడుతూ చెప్పాడు వరదరాజులు.

అతని వంక కృతజ్ఞతగా చూసి, రిక్షాని పక్కకులాగి, తెరలు సర్ది, గబగబ ఎదురుగానున్న పాక హోటల్లోకి జొరబడ్డాడు రిక్షావాడు.

చుట్టని పీలుస్తూ, ఆలోచనలో పడ్డాడు వరదరాజులు.

''బాబుగారూ, టీ...''రిక్షావాడి మాటలకి కళ్లు తెరిచాడతను.

ఎదురుగా గాజుగ్లాసుతో పొగలు కక్కుతున్న టీతో రిక్షాఅతను.

''నాకెందుకులే. నువ్వు తీసుకో'' అన్నాడు వరదరాజులు.

''నే తాగేవచ్చాను బాబూ. ఈ చల్లటి వర్షంలో కాస్త వేడిగా ఇది పడితే బాగుంటుంది. తీసుకోండి బాబుగారూ'' చెప్పాడు రిక్షావాడు.

అతను చెప్పినట్టు వేడివేడిగా టీ తాగితే బాగానే ఉంటుందనిపించింది వరదరాజులుకి కూడా! బెట్టు చేయకుండా గ్లాసు అందుకున్నాడు.

ఖాళీగ్లాసుని హోటల్లో ఇచ్చేసి, సీటు మీద కూర్చొని, పెడల్‌పై కాలేసాడు రిక్షా ఆసామి.

కడుపు కాస్త నిండిందేమో, కాలుకి హుషారొచ్చింది.

ఎదురుగాలిని కూడా లెక్కచేయకుండా స్పీడుగా పోతోంది రిక్షా.

భావనపాడు మాజీ ఎమ్మెల్యే ఎందుకు ఫోన్ చేశాడా అని ఊహలో పడ్డాడు వరదరాజులు.

ఎదుటిపక్షం ఎమ్మెల్యే ఎవరైనా తమపక్క ఒరుగుతానన్నాడా ?

లేక తనపక్షం వాళ్ళు ఎవరైనా అటువైపు దూకనున్నారా ?

అదీకాక రాబోయే ఎలక్షన్ల రాజకీయ ప్రచారానికి ఇంకేమైనా కొత్తఎత్తులు వేశాడా మాజీ?

రిక్షా కుదుపుకు ఆలోచననుంచి బయట పడి పక్కతెర కొద్దిగా తొలగించి చూశాడు వరదరాజులు.

ఊరు సందడి దూరమైందన్నట్లు పచ్చటి పొలాలు చెపుతున్నాయి.

అక్కడక్కడ విసిరేసినట్లు ఇళ్ళు.

ఎడతెరిపిలేకుండా కురుస్తోందేమో వాన జనసంచారం లేదు రోడ్డుపై.

ఇటీవల వెల్లటూరులో నవరంగ్ చిత్ర కళా నికేతన్‌వారు నిర్వహించిన 14వ అఖిల భారత చిత్రకళాపోటీలకి న్యాయ నిర్ణేతగా విచ్చేసిన ప్రముఖ చిత్రకారులు శ్రీ కంచెర్ల బ్రహ్మయ్యగారిని సన్మానిస్తున్న శ్రీ పి. నాగేశ్వరరావు, ప్రక్కన శ్రీ వెల్లటూరి పూర్ణానంద శర్మగార్లని చిత్రంలో చూడవచ్చు



అతనిపేరు మనిషి

దేశం ప్రగతిపథంలో పయనిస్తున్నట్లు గతుకులబాటలో పరిగెడుతోంది రిక్షా.

రిక్షావాడివంక చూశాడు వరదరాజులు.

అతను తొడుక్కున రెయిన్ కోటు పైనుంచి ధారగా కారుతున్నాయి నీళ్ళు.

వయసులో ఉన్న పడుచుపిల్ల చిలిపితనంలా రివ్వున లోనికి దూసుకొచ్చింది చల్లటిగాలి.

గజగజ వణికిపోయాడు వరదరాజులు.

రిక్షాతెరను గబుక్కున వేసేసి, లైటర్‌తో లంకపొగాకు చుట్టను ముట్టించి, గుండెలనిండా దమ్ములాగాడు.

నరాలు ఒక్కసారిగా చైతన్యాన్ని నింపుకొన్నట్లయ్యింది.

అలా ధారగా కురుస్తున్న వానలో, శరీరాన్ని గిలిగింతలు పెడుతున్న చలిలో వేడివేడిగా కోడి మాంసం తింటుంటే ! !

అతని ఆలోచనలంతటితో ఆగిపోలేదు.

కోడిమాంసంతోపాటు నోరు తడుపుకొనేటందుకు ఓ విదేశీ విస్కీ సీసా, ఆపైన నంజుకునేందుకు ఓ మదవతి ఉంటే...

హాయ్ ! ! !

అతని నరాలు మత్తుగా మూలిగాయి.

ప్రపంచంలో అంతకంటె ఏం కావాలి మగాడికి.

ఈ పదవులూ, రాజకీయాలూ, ఎత్తులూ, నటనలూ అన్నీ చిత్తు కాదూ వాటిముందు.

బహుశా ఏర్పాటు చేసే ఉంటాడు భావనపాడు మాజీ.

తన అలవాట్లు, తన మనసు తెలిసిన సహచరుడతను.

ఎంత వేగం అక్కడ వాల్తానా అనిపించింది వరదరాజులికి.

జరగబోయే సమావేశంపై లేదతని మనసు.

మరోసారి తెర తొలిగించి చూశాడు.

కిలోమీటరు పైగానే పోయింది రిక్షా.

ఎదురుగాలిలో కూడా అంతవేగం తొక్కగలుగుతున్నందుకు రిక్షావాడిని అభినందించకుండా ఉండలేకపోయాడు వరదరాజులు. వీడి శ్రమ నుంచుకోకుండా ఓ పదిరూపాయలు పడేస్తే సరి. మరీ గుమ్మైపోతాడు.

ఎదుటి మనిషి తత్వాన్ని బట్టి నడుచుకొంటే ఎంతటివాడైనా చిత్తైపోతాడనడానికి వీడే ఉదాహరణ.

గుబురుమీసాల చాటున గుంభనగా నవ్వుకొన్నాడు వరదరాజులు.

ఈ లెక్కన ఇలా పోతే మరో పాతిక నిముషాలలో బస్టాండులో ఉంటాడు తను. అంతవరకూ వీడి స్పిరిటు తగ్గకుండా చూడాలి తను.

''ఒరే అబ్బీ'' పిలిచాడు వరదరాజులు.

''ఆయ్''

''ఇలా వానలో తడుస్తూ వెళ్తుంటే ఏమనిపిస్తోందిరా నీకు ?''

అవతల నుంచి సమాధానం రాలేదు.

''ఓర్నీ, సిగ్గుపడుతున్నావా ? సరే, పోనీ నే చెప్పనా... ఓ పిటపిటలాడే ఆడది పక్కనుంటే బాగుండుననిపించడంలా ?'' అవతల నుంచి రెస్పాన్స్ వస్తుందేమోనని ఆగాడు వరదరాజులు.

రిక్షావాడు ఏం మాట్లాడక తొక్కుకుపోతున్నాడు.

రిక్షా స్పీడు పెరిగిందనిపించింది వరదరాజులికి.

కేవలం ఆడదాని ఊసెత్తేసరికే వీడింత స్పీడుగా లాగిస్తున్నాడే! ఇక రతిక్రీడల విలాసాల కథలు వింటే ఇంకెలా అవుతాడో ?

సరదాగా నవ్వుకొన్నాడు వరదరాజులు.

మనుషుల మనస్తత్వాలను పరిశీలించటం అతనికి అలావాటు.

చల్లటి గాలి, పుంజుకుంటున్న వర్షం, రగులుతున్న చుట్టా అతనిలో చిలిపి ఊహలను రేకెత్తించాయి.

తన శృంగార అనుభవాల గ్రంధంలోంచి ఓ పుటను వీడికి వినిపిస్తే ?

సరదాగా ఉంటుంది. టైమూ పాసవుతుంది. తన రసికత్వానికి అబ్బుర పడిపోయి నివాళు లర్పించడూ వీడు.

''ఎంతమంది పిల్లలురా నీకు ?'' చుట్టను పీలుస్తూ అడిగాడు.

''అయ్య. పెళ్ళే కాలేదండి నాకు.''

అబ్బుర పడ్డాడు వరదరాజులు.

గోచీగుడ్డ లేకపోయినా మగాడైతే చాలు ఈ దేశంలో– అదే పెద్ద అర్హత కదా పెళ్ళి చేసుకోడానికి.

సరే, బ్రహ్మచారి నంటున్నాడు వీడు. కథ మరీ రంజుగా పడుతుంది. తాను చెప్పే అనుభవానికి దంగైపోయి పెళ్ళని పరిగెట్టడూ కుర్ర నాయాల.

''సరదాగా ఓ కథ చెప్పనా నీకు !'' కొత్త చుట్ట వెలిగిస్తూ అడిగాడు వరదరాజులు.

''అయ్య.''

అదే అంగీకారంగా భావించి గొంతు సర్దుకున్నాడు వరదరాజులు.

''ఈ రోజంటే ఇలా నీ రిక్షాలో రావలసిన ఖర్మ పట్టింది గానీ, కారు దిగేవాడ్ని కాదులే నేను. అందులోనూ ఓ దిక్కుమాలిన కార్పొరేషన్‌కి ఛైర్మన్‌గా ఉన్నప్పుడు యమ రాజభోగం అనుభవించాను. ఇప్పుడు నేను చెపుతున్నది ఈనాటి మాటా ? అబ్బో, ఓ పన్నెండేళ్ళ క్రిందటి సంగతిలే !'' ఉపోద్ఘాతంగా ఆగాడు వరదరాజులు.

నెమ్మదిగా పోతోంది రిక్షా.

వానజల్లు ఇంకా ఎక్కువయ్యింది.



''అరే, నువ్విలా స్లో చేస్తే ఎలాగరా అబ్బాయ్? స్పీడు, స్పీడుండాల మనిషన్నాక. నే కథలోకే వస్తున్నా కానీ, నువ్వు వేగం పెంచు.''

స్పీడు పెంచాడు రిక్షావాడు.

కథ ఎలా ప్రారంభించనా అని ఆలోచనలో పడ్డాడు వరదరాజులు. అప్పుడెప్పుడో జరిగిన సంఘటన తలచుకొంటుంటే ఈనాటికీ ఒళ్ళు వశం తప్పుతోందతనికి.

చుట్ట గట్టిగా పీల్చి, ప్రారంభించాడతను.

''సత్తునానిపాలెం తెలుసా నీకు? ఇక్కడికో పదిమైళ్ళ దూరంలే. అక్కడో హైస్కూలు. ఆ స్కూలు యానివర్సరీకి నన్నో ఏడాది పిలిస్తే వెళ్ళాను. ఏవో నాలుగు సొల్లు కబుర్లు చెప్పిం తర్వాత ఆటల్లో, పాటల్లో గెలిచిన పిల్లలకు బహుమతులివ్వడం ప్రారంభమయ్యింది. ఆ టైములో వాళ్ళుకెలా ప్రైజులిచ్చానో నాకు తెలియదు. నా కళ్ళూ, ఒళ్ళూ నా స్వాధీనంలో లేవనుకో. కారణమేమిటో తెల్సా...'' పెద్దగా నవ్వాడు వరదరాజులు.

''నువ్వు చెప్పకోలేవులే! నేనే చెప్పేస్తున్నా...'' ఊరిస్తున్నట్లు ఓ క్షణం ఆగాడు.

''ఓ అందాల పంతులమ్మ...

అందమంటే అలాటిలాటి అందం కాదనుకో. రంభని కూడా వెక్కిరించే అందం. ఆ పిల్ల ఎలా ఉందంటే కొవ్వెక్కిన పావురంలా, నోరూరిస్తున్న జున్నుముక్కలా, కడ్డకట్టిన పెరుగులా, ఇంకా చెప్పాలంటే బిళ్ళకుడుములా ఉందనుకో. అందులోనూ తెల్లటి జరీచీర, మల్లెపూలతోనూ వచ్చి నా పక్కనే నిలబడి ప్రైజులందిస్తోందేమో వెర్రెక్కిపోయిందనుకో నాకు'' ఆ అమ్మాయి ఎదురుగా నిలబడిందా అన్నంత టెన్షనొచ్చింది అతగాడికి.

కసిగా చుట్ట దమ్ములాగాడు సగం కాలిపోయేలా.

రిక్షావాడు స్పీడుగానే పోతున్నాడనిపించిం దతనికి.

''ప్రైజులిస్తున్నప్పుడూ, సర్టిఫికేట్లిస్తున్నప్పుడూ చేతులు తగిలేవి. దాంతో నరాలు జివ్వుమనేవి. ఆ పంతులమ్మని స్టేజీమీదే పట్టేసుకుందామా అన్నంత ఇదయ్యింది నాకు.'' కంటిన్యూ చేస్తూ చెప్పుకుపోతున్నాడతను.

''ఆ పిల్లమీద మనసయ్యింది నాకు. అటువంటిదాన్ని పొందలేని జన్మ దండగే అనిపించింది. ఫంక్షనంతా అయిపోయాక మెల్లగా సమితి ప్రెసిడెంటుతో కదిపాను విషయం. తేలు కుట్టినట్లయ్యాడు వాడు. దానిగురించి తానూ ఎన్నో ప్రయత్నాలు చేసానని, ఎవరికీ లొంగే ఘటం కాదని, మహా స్ట్రిక్టనీ, అదనీ, ఇదనీ చెప్పాడు. మోజు మరీ పెరిగింది నాలో. అలాంటిదాన్ని పక్కన చేర్చుకొనే జన్మే జన్మను కొన్నాను. మరి దానికెలా తెలియపరచడం? వాళ్ళచేతా, వీళ్ళచేతా చెప్పిస్తే ఏం లాభం? నేనే డైరెక్టుగా అడిగేద్దామనుకున్నాను. నా అంత పెద్దోడు అడిగితే ఒప్పుకోకుండా ఛస్తుందా అనుకున్నా. హెడ్మాష్టరు రూములో ఒంటరిగా కూర్చోని దాన్ని పిలిపించాను.''

ఓ లారీకి సైడిచ్చి, మలుపు తిప్పాడు రిక్షావాడు. సగం దూరం పైగానే వచ్చింది రిక్షా.

''ఫంక్షన్ గొప్పగా ఆర్గనైజ్ చేశావు పిల్లా'' మెచ్చుకోలుగా అన్నాను.

సిగ్గుపడుతూ నవ్వింది.

''నీలాటివాళ్ళు ఇలా పల్లెంలో పడి ఉంటే ఏం లాభం? పట్నం బదిలీ చేయించమంటావా'' అని అడిగాను చనువుగా.

పట్నం హాస్టల్లో తమ్ముడుండి చదువు కొంటున్నాడని, అక్కడికి బదిలీ చేయిస్తే రుణపడి ఉంటానంది ఆమె.

ఎంతో రుణపడి ఉండనక్కరలేదని, ఆ ఒక్క రాత్రికి బూత్ బంగళాకొస్తే చాలునని చెప్పేను చెయ్యి పట్టుకొంటూ.

నా చెంప ఛెడేలుమంది. ఒక ఆడది కానీ, మగాడు కానీ నన్నలా కొట్టడం అదే మొదటిసారి, చివరిసారి అనుకో.

కళ్ళల్లో నిప్పులుచిమ్ముతూ వెళ్ళిపోయిందది.

అంతవరకూ కోరికే ఉండేది నాలో. కానీ ఆ అవమానంతో కసి కూడా పెరిగింది నాలో.

ఆఫ్టాల్ ఒక టీచరమ్మ నన్ను కొట్టడమా?

దాని అంతు ఎలాగైనా చూడాలనుకొన్నాను.

పొగరుమోతు గుర్రాన్ని లొంగదీసుకోడమే మగతనమంటే, అలాటి మొండిదాన్ని అనుభవిస్తేనే ఆనందం.

హెడ్మాష్టర్ని పిలిచి, దాని పేరు కనుక్కొన్నాను.

అమృతవల్లనో, అచ్యుతవల్లనో చెప్పాడతను...

రిక్షా స్లో అయ్యింది.

''ఇదంతా ఎన్నేళ్ళ క్రిందటన్నారూ?'' రిక్షావాడు అడిగాడు. అతని గొంతులో ఏదో మార్పు.

రిక్షావాడు వేడెక్కిపోయాడని సంబరపడిపోయాడు వరదరాజులు.

''పానకంలో పుడకలాగ ఏవిటయ్యా ఈ చొప్పదంటు ప్రశ్న? పన్నెండేళ్ళ క్రిందట. సరిగ్గా పన్నెండేళ్ళ క్రిందటని ఎలా గుర్తుందంటే ఆ తర్వాత నెలలో నేను మంత్రినయ్యాను కాబట్టి.''

అంతవరకు నిశ్శబ్దంగా వున్న ఆకాశం ఫెళ ఫెళా గర్జించింది.

ఎక్కడో పిడుగు పడింది.

వరదరాజులదురుకొని, గుండెలపై ఊసుకున్నాడు.

''సరే, తర్వాతేమయిందనుకొన్నావ్? నేనూరుకొంటానా? జమా జెట్టీల్లాంటి నలుగురు మనుషుల్ని పంపి, దాన్ని బంగళాకి ఈడ్చించు



పశ్చిమ దేశాల వారిని నిందించడ మెందుకు?

బాగా బలసిన తిండిపోతులుగా పశ్చిమ దేశాల వారిని చిత్రించే ఒక కార్టూన్‌ను చాలా కాలం కిందట భారతీయ పత్రికలలో ఒక దానిలో చూచాను. వారిలో చాలా మందికి చాలినంత తిండి లభించదని మీకు తెలియక పోవచ్చుగానీ నాకు తెలుసు. ఈ కార్టూన్ అతిశయోక్తి మాత్రమే కాదు. ప్రజలు ఆకలితో బాధపడు తూండడానికి ఇతరులెవరో కారణమని నిందించు తుంది. అసలు సమస్య మన అధిక జనాభా. అమెరికా జనాభాకు మూడింతలున్నది మన జనాభా. సాగుకు లాయకీ అయిన మనదేశంలోని భూమి అమెరికాలోని భూమిలో మూడో వంతుం టుంది. అంటే వ్యత్యాసం తొమ్మిది రెట్లు !!! ఇందుకు పశ్చిమ దేశాల వారిని మనం ఎందుకు నిందించాలి?

మన దార్రిద్యం సమస్యకు పరిష్కారం జనాభాను తగ్గించడమేనన్న గట్టి నమ్మకం అమెరికాలో చాలా సంవత్సరాలు గడపిన తర్వాత నాకు కలిగింది.

మన పూర్వీకులకు ఎనిమిది మంది పది మంది బిడ్డలుండేవారు. దానికి కారణం జనాభాను అదుపులో పెట్టే పరికరాలు వారికి అందుబాటులో లేకపోవడం. ఇప్పటి తరం వారు ఇరువురు లేదా ముగ్గురు బిడ్డలను కలిగి వుంటున్నారు. ఇది మంచిదే. ఒకే ఒక బిడ్డ వుంటే ఇంకా చాలా మంచిది. ఈ పద్ధతి ననుసరించితే వంద సంవత్సరాలలో మనం సుసంపన్నుల మవుతాం. ఇటువంటి కుటుంబాల వల్ల ప్రయోజనాలు చాలా వున్నాయి.

మరొక సంగతి కూడా నాకు తెలుసు. మొదటి బిడ్డ ఆడదయితే మగపిల్లవాడు కావాలని కాన్పులను కొనసాగించుతారు. ఇదొక భ్రమ. వెయ్యి సంవత్సరాల కిందటయితే ఆడపిల్లలను హీనంగా చూస్తే అర్థం వుండేది.

నన్ను అపార్థం చేసుకోకండి. ప్రభుత్వం బలవంతంగా జన్మ నిగ్రహ పద్ధతులను, కుటుంబ నియంత్రణ పద్ధతులనములు పంచాలని నేను సూచించడం లేదు. ప్రజలే ఐచ్ఛికంగా ఆ పద్ధతి ననుసరించాలంటున్నాను. ప్రజాస్వామిక వాదిని నేను. మనసా వాచా భారతదేశమంటే నాకు ఇష్టం. ఎవరికీ అసౌఖ్యం కలగరాదని నా కోరిక. ఐచ్ఛికంగా ఒకే బిడ్డ పద్ధతి ననుసరించితే చాలా బాగుంటుంది. ఈ అంశం గురించి భారతీయుల అభిప్రాయాలను తెలుసుకోవాలనుకుంటున్నాను. 9133, మెసావుడ్స్ ఎవెన్యూ, సాండియాగో, కాలిఫోర్నియా 92126 యు. ఎస్. ఏ. అనే అడ్రెస్‌కు ఏ భాషలోనైనా తమ అభిప్రాయాలు నాకు వ్రాయవచ్చు.

— నరేంద్ర బి. శేఠ్ ★

అతని పేరు మనిషి

కొచ్చాను. అప్పుడు చూడు దాని ఏడుపు. బ్రతిమాలింది. కాళ్ళు పట్టుకొంది. తనకి పెళ్ళి సంబంధం కుదిరిందన్నాది. ఇంకా ఏమేమో చెప్పింది. అది సాకులు చెప్తూ తప్పించు కొంటున్నకొద్దీ నాలో కసి పెరిగింది. దాన్ని చేజిక్కించుకొని...'' కసిగా చుట్టని నలిపాడు వరదరాజులు.

సడన్ బ్రేకుతో రిక్షా ఆగింది.

సైడు తెర తొలగించి లోనికి చూసాడు రిక్షావాడు.

ఎర్రటి కళ్ళూ, పీక్కుపోయిన ముఖమూ, అదరుతున్న పెదవులూ...

వాడ్నిచూస్తుంటే జాలేసింది వరదరాజులకి.

పాపం కడుపు నింపుకోడం కోసం ఈ వానలో ఇంత యాతన వీడికి.

''ఏరా, ఒంట్లో బాగోలేదా ?'' లాలనగా అడిగాడు.

రిక్షా వాడు అతని కళ్ళల్లోకి సూటిగా చూసి, అవునూ కాదన్నట్టు తలూపి, తిరిగి రిక్షా ఎక్కాడు.

మరేం మాట్లాడ బుద్ధికాలేదు, వరద రాజులుకి.

ఓ పదినిముషాల తరువాత బస్‌స్టాండులో ఆగింది రిక్షా.

రిక్షా దిగి, జేబులో చెయ్యిపెట్టి, ఓ పది రూపాయల నోటు బయటికి తీసి, రిక్షావాడికి ఇవ్వబోయాడు వరదరాజులు.

''వద్దు'' చెప్పాడు రిక్షావాడు రిక్షాని వెనక్కు తిప్పుతూ.

''ఏం'' ఆశ్చర్యంగా అడిగాడు వరదరాజులు.

''ఆరోజు నువ్వాలా నాశనం చేసిందెవరినో తెలుసా ? ఇంకో నాలుగు నెలలలో పెళ్ళి కాబోతున్న నా అక్కని. అవమానం భరించలేక ఉరి పోసుకుంది అక్క. నా అక్కను తినేసిన మృగం కనబడితే చంపేద్దామనే అనుకున్నాను నేను. జనసంచారం ఏమీలేని ప్రదేశంలో నిన్ను చంపడమెంతసేపు ? కానీ అడుగడుగునా మానవత్వాన్ని చూపుతూ నాలో పగకు సంకెళ్ళు వేసావు నువ్వు.

ముక్కూ ముఖం ఎవరో తెలియని వ్యక్తికి రెయిన్‌కోటిచ్చావు. ఒక ఆకలి కడుపుని తడిమావు. యోగక్షేమాలడిగావు. మానవత్వమున్న మనిషిలా ప్రవర్తించావు. ఆదరించిన చేతులను నరకలేక పోయాను నేను. అందుకే నిన్ను చంపడానికి నా చేతులు ముందుకు రాలేదు. బ్రతికిపోయావు. ఇలానే మనిషిలా బ్రతుకు, రెయిన్‌కోటు అతనిపై విసిరేసి, రిక్షా తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు రిక్షావాడు.

నిర్విణ్ణుడై చూస్తూండిపోయాడు వరదరాజులు. ★